# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 18 డిసెంబర్ 2022

## టీడీపీ నాయకులపై వైసీపీ రౌడీల దాడులు అరాచక పాలనకు నిదర్శనం

**- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి**



**కడప వైద్య విభాగం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**

మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ రౌడీ మూకలు పోలీసుల సహకారంతో మరోసారి టీడీపీ శ్రేణులపై దాడికి పాల్పడడం దారుణమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి వాపోయారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ గూండాలు దాడులకు పాల్పడినా పోలీసులు వారిని వదిలి టీడీపీ కార్యకర్తలపై లాఠీఛార్జీ చేయడం దారుణమన్నారు. పోలీసుల సహకారంతో టీడీపీ శ్రేణులపై వైసీపీ గూండాలకు మరో సారి దాడికి యత్నించారన్నారు. ఈ దాడులు రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శనమన్నారు. వైసీపీ అరాచక పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని అధికార మదంతో ఇప్పుడు వైసీపీ చేస్తున్న అరాచకాలకు త్వరలో మూల్యం చెల్లించుకుంటారన్నారు. టీడీపీ వర్గీయుల కార్లు, కార్యాలయాలు తగలబెట్టి, కార్యకర్తలపై రాళ్లు, రాడ్లతో దాడులు చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు.

## కరెంట్ షాక్‌తో యువకుడు మృతి



**రాజుపాలెం, డిసెంబరు 17, ప్రభాతవార్త.**

కుమ్మరపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డి (46) అనే యువకుడు శుక్రవారం రాత్రి కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు, వివరాల్లోకి వెళ్తే వెల్లాల పుణ్యక్షేత్రంలో కళ్యాణమంటపంలో మేనేజర్గా పని చేస్తూ నీటి పంపు మోటర్ స్విచ్ వేయు క్రమంలో కరెంట్ షాక్కు గురికావటంతో స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెంది నట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం. రాజుపాలెం ఎస్సై రాజగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుదర్యాప్తు చేస్తున్నారు.

## పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి IVలో

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**- మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే**

**- అన్నివిధాలా ఆదుకుంటామని హామీ**



**కొండాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త :**

కొండాపురం మండలంలోని పాతకొండాపురం రాఘవేంద్రా ఆశ్రమం పునరావాసం వద్ద కడప-తాడిపత్రి జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఎ.రంగనాథ్(14) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు కడప నుండి తాడిపత్రి వైపు వెళ్తున్న ఆల్విన్ పాత కొండాపురం పునరావాస కేంద్రం వద్దకు రాగానే అటువైపు నుండి వస్తున్న యువకుడిని ఢీకొనడంతో అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వా సుపత్రికి తరలించారు. శనివారం ఉదయం 11.00గంటలకు జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని హామీఇచ్చారు. దహన సంస్కారాల నిమిత్తం కొంత నగదును ఆర్థికసాయంగా ఇచ్చారు. ప్రజలు హైవే రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోలీసువారిని కూడా రోడ్డు పక్కన నిలే ్చ వాహనాలు అడ్డంగా లేకుండా చూడా లని పోలీసు అధికారులను ఆదేశించారు. కొండాపురం ఎస్సై సత్యనారాయణ, సీఐ సుదర్శనప్రసాద్‌లు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పెంజి అనంతపురం పెద్దిరెడ్డి, కొండాపురం బుజ్జి, గండ్లూరు బాలనాగిరెడ్డి, కొండాపురం నన్నేసాహెబ్, తదిత రులు పాల్గొన్నారు.

## మినీలారీ - స్కూటర్ ఢీ

ఒకరు మృతి IVలో

## జగన్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

**ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా**



**కడప, డిసెంబర్ 16 ప్రభాతవార్త :**

భారత దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రవేశ పెట్టి పేద బడు గుబాలహీన వర్గాల ప్రతి గడప గడపకువెళ్లి సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని, మనసున్న ముఖ్యమంత్రి కి ఆశీర్వాదాలు అందించాలని ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ అన్నారు. శనివారం నగరంలోని 30 వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ షేక్. మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో సెవెన్ రోడ్స్ సచివాలయం- 4 పరిధిలోని పాలెం పాపయ్య వీధి, బొల్లినేని డయాగ్నసిస్ సెంటర్, పాత కృష్ణ సినిమా థియేటర్ వద్ద గల పలు వీధులలోని పలు ప్రాంతాలలో పర్యటన. 71 వ రోజు న "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా ప్రారంభించారు. ఈ సందర్బంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి.. ప్రభుత్వ పథకాల లబ్ది దారులతో నేరుగా మాట్లాడారు. పథకాల లబ్ది సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్నవారు ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయగా.. పలువురు తమ సమస్యలను అంజాద్ బాషా దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబందిత అధికారులకు రెఫర్ చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరుతున్నాయని ఉపముఖ్యమంత్రి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందడం జగన్ మోహన్ రెడ్డి పారదర్శక పాలనకు అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో... ప్రతి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై లబ్దిదారుల మనోభావాలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితో పాటు నగర 30 వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, మార్కెట్ యార్డు కమిటీ వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, వేణుగోపాల్, వైకాపా నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, సుబాన్ బాషా, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, పసుపులేటి మనోజ్ కుమార్, రమణ, నాయకురాళ్లు టి.వి. సుబ్బమ్మ, పసుపులేటి రాజేశ్వరి, వివిధ కార్పొరేషన్ ల ఛైర్మన్ లు, డైరెక్టర్లు, ఇతర నగర కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అంతకు మునుపు కార్పొరేటర్ బాల స్వామి రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బిల్టప్, భవాని నగర్ వద్ద ఎస్.డి.ఆర్.ఎఫ్. నిధులు రూ. 53 లక్షల తో బుగ్గ వంక కాలువ యందు కల్వర్ట్ ఎగువ భాగమున కాలువ నిర్మాణంను ఉపముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, వేణుగోపాల్, వైకాపా నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, సుబాన్ బాషా, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సంజీవ కుమార్, రత్నాల రాజు, నారాయణ స్వామి, అబీద్ బాషా, దిల్షాద్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేకి రైతులు, భూ యజమానులు అధికారులకు సహకరించాలి

**-విచారణ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం**

**-రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి -కలెక్టర్ గిరీషా పిఎస్**



**రాయచోటి.డిసెంబర్ 17 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్విత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా అన్నమయ్య జిల్లాలో 471 రెవెన్యూ గ్రామాలకు గాను మొదటి విడత రీసర్వేలో భాగంగా నేటి వరకు 66 గ్రామాలలో రీసర్వే పూర్తయిందని జిల్లా కలెక్టర్ గిరీషా తెలిపారు. శనివారం రాయచోటి కలక్టరేట్‌లో వైఎస్సార్ జగనన్న శాశ్విత భూ హక్కు మరియు భూ రక్ష కార్యక్రమంపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన 66 గ్రామాలకు గాను నేటి వరకు 3రెవెన్యూ డివిజన్‌లలోని 39 గ్రామాలలో 4100 పైచిలుకు భూ యజమానులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేయడం ఇంకా మరో పదివేల పైచిలుకు భూ హక్కుపత్రాలను పంపిణీ చేయవలసి ఉందన్నారు. రైతుల ప్రజల శ్రేయస్సు దృష్ట్యా 100 ఏళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వేలో భాగంగా సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న హద్దు తగాదాలు, భూమిపై హక్కు కలిగిన వారసుల యొక్క పేర్లు, భూరికార్డులలో పేర్లు నమోదు చేసుకుని సాగుదారులను భూ రికార్డులలో నమోదు చేయడం వంటి చాలా సమస్యలను రెవెన్యూ మరియు సర్వే శాఖలు పరిస్కారం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికి ముఖ్య విజ్ఞప్తి చేయడం ఏమంటే ఒక వేళ రిసర్వే పూర్తయిన గ్రామాల్లో హక్కు నమోదు ప్రక్రియలలో ఏవైనా తప్పులు దొర్లినాకూడా ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల నమోదు చట్టం 1971 సెక్షన్ 3 సబ్‌సెక్షన్ ప్రకారం హక్కుదారులు సంవత్సరం లోపల తహశీల్దార్ వారి ఎదుట సంబంద హక్కు పత్రాలతో హాజరయిన ఎడల తగు విచారణ చేసి వారి హక్కులను భూ రికార్డులలో నమోదు చేయుటకు అవకాశం ఉందన్నారు. చాలా మందికి రి సర్వేపై అవగాహనలేదు. ముఖ్యంగా రైతులకు విజ్ఞప్తి చేయడంఏమంటే వారు భూ మీద అనుభవంలో ఉంటారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఆస్తులను అన్నదమ్ముల మద్య డివిజన్, పార్టీషన్ చేసుకుని ఎలాంటి అగ్రిమెంట్ పత్రాలు కూడా లేకుండా ఉంటారు. అలాగే చాలా వరకు నోషనల్ ఖాతా, ఎల్‌పిఎం ఖాతా నంబర్ లేకుండా అలాగే కొనసాగుతుంటారు. పొలంగట్లు, తదితరాల వల్ల కొద్ది మాత్రమే తేడా వస్తుంది. ఎక్కువ మొత్తంలో తేడా వస్తే పరిశీలించి నిబందనల మేరకు చర్యలు తీసుకుంటాము. అధికారికంగా భూహక్కు పత్రాలను జారీ చేస్తున్నందును ఇబ్బందలు ఏర్పడని పాత్రికేయులు అడిగిన ఒక ప్రశ్నకు కలెక్టర్ సమాదానం ఇచ్చారు. భూమికి సంబందించి ఎలాంటి పత్రాలు లేని వారికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కాని, అడంగల్ కాని రెవెన్యూ రికార్డుకాని ఏదో ఒక పత్రం ఇచ్చి ఉంటారు. భూపై హక్కు ఉందని వారి వద్ద ఉన ్న డ్యాకుమెంట్ తీసుకొస్తే పరిశీలించి చర్యలు తీసుకుటాము. కాని రికార్డులలో ప్రభుత్వ భూమి అని ఉంటేమా త్రం ఏమి చేయలేము. అప్పుడు కూడా రెవెన్యూ రికార్డులు పత్రాలతో కాకుండా హక్కులు ఉన్నాయని ఇంకేదయిన డ్యాకుమెంట్ చూపిస్తే దానిని పరిశీలించి తగిన న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాయచోటి పట్టణాభివృద్దిపై కూడా ప్రత్యేక దృష్టిసారించామని కొత్త కలెక్టరేట్ భవననిర్మాణం, శిల్పారామం, నగరవనం, పార్కులు, సెంట్రల్ మీడియా, తదితర ఏర్పాట్లు కూడా వేగవంతంగా చర్యలు గైకొంటున్నట్లు ఈ సందర్బంగా పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాదానం ఇచ్చారు.

## జగన్ మాటలు ప్రజలు నమ్మరు

## వచ్చేది టిడిపి పాలన

## మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి



**రాయచోటి, డిసెంబర్ 17 ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాయమాటలు ప్రజలు నమ్మరని వచ్చే ఎన్నికల తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో పాలన సాగిస్తుందని రాయచోటి దర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి చెప్పారు రాయచోటి పట్టణంలో నాలుగైదు వార్డుల్లో శనివారం రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులతో భారీగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వైసీపీ పాలనలో ప్రజలకు ధరలు ఏ విధంగా పెరిగాయి వివరించడం ఇచ్చెలవిడిగా నిధులు దుర్వినియోగం చేసి అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయన్నారు ముస్లిం మైనార్టీలకు తెలుగుదేశం పాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పాలను సాగించిందన్నారు ఒక్క అవకాశం ఇవ్వండి అన్న జగన్ మోహన్ రెడ్డి అధికారం వచ్చిన తర్వాత ప్రజల నెత్తిన చట్టగోపం పెట్టారని ఆరోపించారు. రమేష్ కుమార్ రెడ్డి ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు వారి స్థితిగతులు వైసిపి ప్రభుత్వం పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఎక్కడికెళ్ళినా ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మ రథం పడుతున్నారని వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు రాష్ట్రంలో కరెంట్ చార్జీల పెంపు ఇంటి పన్ను నీటి పన్ను చెత్త పన్ను రకరకాల పనులు వేసి సామాన్య జనాన్ని నడ్డి విరిచారని రమేష్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించి రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలని రమేష్ కుమార్ రెడ్డి ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు భారీగా పాల్గొన్నారు.

## 20 సెంట్లలో రూ.5.65 కోట్ల ఎంపీ నిధులతో బీసీ భవన్ నిర్మాణం



**కడప కార్పొరేషన్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**

బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లు అన్నారు. శనివారం కడప నగరంలోని పాత రిమ్స్ నందు బీసీ భవన్ నిర్మాణానికి వారితో పాటు జేసీ సాయికాంత్‌వర్మ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.శంకర్‌రావు, బీసీ సంక్షేమ సంగం యువజన రాష్ట్ర అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్‌లు శంకు స్థాపన చేశారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు ఉన్నాయన్నారు. బీసీలకు 4 రాజ్యసభ సభ్యులుగా, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా బీసీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని కొనియాడారు. 56 కార్పొరేషన్లు, డైరెక్టర్లు నియమించారని పేర్కొన్నారు. మొదటిసారి కడపలో బీసీ భవనాన్ని ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమన్నారు. ఎంపీలు పరిమాళ్ నత్వాని రూ.5 కోట్లు, అవినాష్‌రెడ్డి రూ.65లక్షల ఎంపీ నిధులతో బీసీ భవన్ ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. గత టీడీపీ పాలనలో బీసీలకు చేసిందేమీ లేదని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ లంటే బ్యాక్ బోన్‌గా గుర్తించిందన్నారు. కడప నడిబొడ్డున 20 సెంట్లను కేటాయించి బీసీలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ భూమి కేటాయించినట్లు తెలిపారు. బీసీ భవన్‌లో మొదటి అంతస్తులో కమ్యూనిటీ హాలు, 2వ అంతస్తులో ఎపేద బీసీ నిరుద్యోగులకు స్టడీ సర్కిల్, లైబ్రరీ, మూడో అంతస్తులో అతిథుల కోసం, విద్యార్థుల కోసం రూములు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జడ్పీ వైస్‌ఛైర్మన్ బాలయ్య, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, గౌరవ సలహాదారులు ఏవీఆర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్, సిందే రవిచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పల శివ యాదవ్, గువ్వల మధుసూదన్, వైసీపీ నేతలు పాకా సురేష్, సుబ్బారెడ్డి, మనోజ్, అంజి, టీపీ వెంకట సుబ్బమ్మ, నారాయణమ్మ, విజయకుమారి, కృష్ణవేణి, కమిటీ సభ్యులు, బీసీ నేతలు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నందలూరు రైల్వేపరిశ్రమ కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం

**ఐకెపిఎస్ ఆధ్వర్యంలో ఎన్ని పోరాటాలు చేసినా ఫలితం శూన్యం : మాట ఇచ్చారు... తప్పారు**



**నందలూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త**

నందలూరు మండలం గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని కేంద్ర బిందువుగా ఒకప్పుడు వెలుగు వెలిగింది. నేడు వెల వెలబోతోంది. బ్రిటీష్ కాలం నుండి రైల్వే కేంద్రంగా ఉండి 150 ఎకరాల విస్తీర్ణంలో వందలాది మంది రైల్వే కార్మికులు, రైల్వే లోకోషెడ్, అన్నిశాఖలకు సంబంధించిన అధికారులు ఇక్కడ ఉండేవారు. కాల క్రమేనా ఒక్కొక్క పరిశ్రమ మూతపడుతూ ఉన్న శాఖలన్ని వేరే ప్రాంతాలకు తరలించే పనిలో పడ్డారు అధికారులు. ప్రస్తుతానికి ఉన్న రన్నింగ్ స్టాప్ లాబి, ఈడబ్ల్యుఐ శాఖలు మాత్రమే నందలూరులో ఉన్నాయి. ఉన్న శాఖలు పోకుండా మూతపడ్డ లోకో షెడ్ స్థానంలో పరిశ్రమను తీసుకురావాలనే ఉద్ధేశ్యంతో 2006లో ఏర్పాటు అయిన ఐకెపిఎస్ పేరుతో మండలంలోని అన్ని పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు ప్రజల మద్దతుతో 77 రోజుల నిరాహార దీక్షలు చేయగా ఆ దీక్షకు ఢిల్లీ పెద్దలే మండల సమస్యలు వినడానికి ఐకెపిఎస్ వారిని ఆహ్వానించారు. అప్పుడు ఎంపిగా ఉన్న సాయిప్రతాప్, వెంకయ్యనాయుడు ఆధ్వర్యంలో ఢిల్లీలోని రైల్వేశాఖ మంత్రిని, అధికారులను కలిసి నందలూరు యొక్క విశిష్టతను తెలియజేసి మూతపడిన లోకోషెడ్ స్థానంలో ప్రత్యామ్నాయంగా రైల్వే పరిశ్రమ ఏదోకటి అవసరమని తెలియజేయడంతో నాడు రైల్వేశాఖ మంత్రి రాయలసీమ ప్రాంతంలో ఒక వ్యాగిన్ రిపేరు షాపు ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామని, దీనికోసం ఒక కమిటిని నియమించామని, వారు ఆ ప్రాంతాలను పరిశీలించి కమిటి ఇచ్చిన నివేదిక ప్రకారం అక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని మాట ఇచ్చారు. రాజకీయ నాయకులు ఇచ్చిన కమిటీని తుంగలో తొక్కి వారి స్వార్థ ప్రయోజనాల కోసం చిత్తూరు జిల్లాలోని ఏర్పేడులో ఆ పరిశ్రమను స్థాపించేందుకు సన్నాహాలు జరుగుతున్న తరువాత దానిపై సాయిప్రతాప్, వెంకయ్యనాయుడులను అడుగ్గా వారు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంతో నందలూరుకు రావాల్సిన పరిశ్రమ ఏర్పేడుకు వెళ్లిపోయిందని ఆయన ధ్వజమెత్తారు. 5 పర్యాయాలు ఎంపిగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలను సాయిప్రతాప్ మోసం చేశారని మస్తానయ్య దుయ్యబట్టారు. అదేవిధంగా వెంకయ్య నాయుడు ఇచ్చిన మాట తప్పాడని, రైల్వే పరిశ్రమ కోసం నేను పోరాడినందుకు తనపై 11 కేసులు ఉన్నాయని, 12వ కేసు అనేది తనకేమి కొత్తకాదు అని పోరాటాలు చేయడంలో నేనెప్పుడూ వెనుకడుగు వేయనని ఇకనైనా స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, ఎంపిలు దీనిపై స్పందించాలని, అలాగే సమస్యలు పరిష్కారం కావని, రైల్‌రోకో చేస్తే తప్ప రైల్వే అధికారులు ముందుకు రారని, ఎంపి, ఎమ్మెల్యే వచ్చి నందలూరు సమస్యలపై రైల్‌రోకోకు సిద్ధపడాలని ఆయన సవాల్ విసిరారు. మీరు వస్తే మీతోపాటు మండల ప్రజలు కూడ వస్తారని, ఎంపి, ఎమ్మెల్యేలు మండలాన్ని అభివృద్ధి చేస్తారనే ఉద్ధేశ్యంతో గెలిపించారు తప్ప మీ స్వలాభం కోసం మీరు పని చేయడం చాలా దురదృష్టకరమన్నారు. నేను పత్రికాముఖంగా తెలియజేయడం ఏమనగా రైలు బండ్లు నిలుపుదల కోసం ఆరు గంటలు కరెంటు స్థలంపై కూర్చొనేవాన్ని నందలూరు పరిశ్రమ రాకపోతే ఆ కరెంటు వైర్లకు నా శవం ఏలాడుతుంది అని అన్నారు. కనుక స్థానికంగా ఉన్న ప్రజలు, నాయకులు మండలం కోసం పనిచేసేవారితో కలిసి వస్తారా, మాటలు చెప్పేవారితో తిరుగుతుంటారో మీరే నిర్ణయించుకోవాలని ఆయన అన్నారు.

## వైభవంగా శ్రీ ఈశ్వరీ దేవి అమ్మవారి ఆరాధన



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన ఈశ్వరీదేవి అమ్మవారు, తెలంగాణ మాజీ స్పీకర్‌కు ఘన స్వాగతం పలికిన విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు.

**బ్రహ్మంగారి మఠం, డిసెంబరు 17 ప్రభాతవార్త :**

కాలజ్ఞాన విరచితులైన జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దివ్యానుగ్రహంతో జన్మించిన పరమేశ్వరీ స్వరూపిణి జగన్మాతయణి జగద్విఖ్యాతి గాంచిన శ్రీ ఈశ్వరీ దేవి అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాల సందర్భంగా 17వ తారీఖున శనివారం సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర సుదినం ఈశ్వరీదేవి క్షేత్రమున ఉదయం వందలాది శ్రీ ఈశ్వరీ మాత మహిళా సేవా సమితి చైర్మెన్ కమ్మరి పార్వతమ్మ, సమితి సభ్యులు, భక్తుల ద్వారా సామూహిక కుంకుమార్చన, శాంతి హోమం నిర్వహించడం జరిగినది. అనంతరం మండలంలోని పాఠశాలల విద్యార్థులతో శ్రీ ఈశ్వరీ దేవి అమ్మవారి చరిత్రకు సంబంధించిన ప్రశ్నా పత్రాలతో క్విజ్ పోటీలు నిర్వహించారు. శ్రీ ఈశ్వరీదేవి మఠాధిపతి శ్రీ శివ కుమార స్వాముల వారి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి ప్రారంభమై అమ్మవారి ఆరాధన మూడవ రోజు శనివారం వేలాది మందిగా తరలి వచ్చిన భక్తులతో మఠం ప్రాంగణం అంతా కిక్కిరిసి పోయింది. మధ్యాహ్నం అమ్మవారి భక్తులకు దీక్షాంబధన అలంకారం నిర్వహించారు. రాత్రి వందలాది మంది భక్తుల చేతుల మీదుగా సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఈశ్వరీ దేవి అమ్మవారి స్వరూపంతో తులాభారం కార్యక్రమాన్ని మఠాధిపతి దంపతులు నిర్వహించడం జరిగినది. అలాగే రాత్రికి సింహ వాహనం ద్వారా గ్రామోత్సవాన్ని మఠం మాడ వీధులలో వేలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించారు. అమ్మవారి ఆరాధన మహోత్సవాలకు దూర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు వందలాది వాహనాలలో తరలిరావడం జరిగింది. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి జగన్‌మోహన్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది ద్వారా నిర్వహించినట్లు శ్రీ ఈశ్వరీ మహా దేవి మఠం యాజమాన్యం తెలిపారు. ఆరాధన మహోత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ విద్యా సాగర్ పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్న తెలంగాణ మాజీ స్పీకర్**

ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవాలలో తెలంగాణ మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ మధుసూదన్ ఆచారితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. వారికి ఆలయ ఈవో జగన్‌మోహన్ రెడ్డి ఆలయ లాంచనాలతో సాదరంగా ఆహ్వానం పలికి, అనంతరం బ్రహ్మంగారి జీవిత చరిత్ర, కాలజ్ఞానం గురించి వారికి వివరించారు. బ్రహ్మంగారి మఠంకు చేరుకున్న వారికి పలువురు విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, పలువురు భక్తులు స్వాగతం పలుకుతూ శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తులసి వెంకట శివ నారాయణ, కలసపాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మలిపెద్దు రాజా, సుబ్రమణ్యం, రవీంద్రాచారి, ఉప సర్పంచ్ సమ్మయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## దేవుని మాన్యం భూములకు దారెక్కడ?

**- దయచేసి దారి చూపండి మహోప్రభో!**

**- రచ్చబండలో ఫిర్యాదు - ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్**



**కమలాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**

కమలాపురం నియోజకవర్గం చదిపిరాళ్ల గ్రామంలో శ్రీఅగస్తేశ్వర ఆలయానికి చెందిన దేవుని మాన్యం భూములు సర్వే నెంబరు 154లో 9.22 ఎకరాలు, సర్వే నెంబరు 149లో 9.71 ఎకరాలు, గొల్లపల్లి దగ్గర ఉన్న సర్వే నెంబరు 828లో 2.89 ఎకరాలు కలిపి 23 ఎకరాలు పంట భూమి ఉండగా పూర్వం నుంచి పొలం కలిగి ఉన్న రాకపోకలు హఠాత్తుగా మాయం అయ్యాయి. గత రెండు సంవత్సరాలుగా ఆ భూమిని ఎవరూ పొలం పెట్టుకోనీయకుండా బీడుగా మార్చిన వైనం. ఆ చుట్టుపక్కల బూ యజమానులు దేవుని మాన్యంకు పూర్వం నుంచీ ఉన్న దారిన పోనిచ్చేది లేదని అడ్డుకుంటున్నారు. ఆ 23 ఎకరాలు ఇప్పుడు కంప చెట్లతో, ముళ్లపొదలతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. ఈ విషయంపై స్పందన కార్యక్రమంలో మూడు సార్లు విననవించుకున్నా ఫలితం లేదు. అలాగే రచ్చబండలో అర్జీ ఇచ్చినా ఫలితం శూన్యం. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన ప్రస్తుత ఎంఆర్‌ఓను ఈ విషయంపై త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించినా ఫలితం లేదు. ఎండోమెంట్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌లకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కార్యనిర్వాహణాధికారి దయ చేసి మా దేవాలయ భూమి దేవుని మాన్యంకు దారి చూపండి అంటూ దేవాలయ కమిటీ సభ్యులు, ఆలయ దర్మకర్త సి.జయరామిరెడ్డి విన్నవించుకుంటున్నారు.

## ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



వార్త IVవ పేజీలో



## ఉద్యోగాల భర్తీకి దశల వారీ పోరాటాలు : డీవైఎఫ్ఐ

జమ్మలమడుగు, డిసెంబరు 17, ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగాల భర్తీకై రాబోయే రోజుల్లో దశల వారీగా పోరా టాలు నిర్వహిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. 16, 17 తేదీల్లో విజయవాడలోని వద్దేశ్వ రంలో రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగిం దన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాష్ట్ర వర్క్‌షాప్ భవిష్యత్తు కార్యా చరణలో భాగంగా ఖాళీ పోస్టుల భర్తీ కోసం నిరుద్యోగులతో కలిసి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, లోకేంద్ర, ఇమాం పాల్గొన్నారు.

## అన్ని హంగులతో బీసీ భవన్ నిర్మాణం

కడప కార్పొరేషన్, డిసెంబరు 17, ప్రభాతవార్త:



బీసీ భవన్ నిర్మాణానికి జగన్ సర్కార్ స్థలాన్ని కేటాయించి ఎంపీ నిధులు ఇవ్వడం శుభపరిణామ మని అరే మరాటీ రాష్ట్ర కన్వీనర్, జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు సిందే రవిచంద్రరావు అన్నారు. శని వారం స్థానిక పాత రిమ్స్ ప్రాంగణంలో బీసీ భవన నిర్మానం భూమి పూజ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉప ముఖ్య మంత్రి అంజాద్ బాషా, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి బీసీ భవన్ నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. అన్ని హంగులతో 20 సెంట్లలో బీసీ భవన్ నిర్మానం అవుతుందని పేర్కొన్నారు. సమావేశాలకు కమ్యూనిటీ హాలు, పేద బీసీ విద్యార్థులకు స్టడీసర్కిల్, గ్రంథా లయం ఏర్పాటవుతుందన్నారు.

## చిన్నారులకు వ్యాక్సిన్ తప్పనిసరి

కమలాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:



పుట్టిన శిశువు నుంచి 3 సంవత్స రాల లోపు చిన్నారులకు క్రమం తప్ప కుండా వ్యాధి నిరోధక టీకాలు వేయిం చాలని, ప్రపంచ ఆరోగ్య సంస్థ మానిటర్ డా.వి.లక్ష్మీదేవి పేర్కొన్నారు. శనివారం డా.లక్ష్మీదేవి యూపీహెచ్‌సీ పరిధిలోని కమలాపురం మార్కెట్‌యార్డ్ పరిధిలోని బీడీ కాలనీ, పక్కీర్‌కాలనీ, పెద్ద చెప్పలి, కోగటం, గంగవరంలో జరుగుతున్న అవుట్ రీచ్ సెషన్స్‌ను పరిశీలించి ప్రతి బిడ్డకు నిర్ణీత సమయానికి టీకా వేయించాలని తల్లిదండ్రులకు తెలిపారు.

## 35 క్వింటాళ్లు రేషన్ బియ్యం స్వాధీనం

దువ్వూరు, డిసెంబరు 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని సి.బయనపల్లె గ్రామంలో ఓ ఇంట్లో దాచి ఉంచిన 35 క్వింటాళ్లు రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ రామకృష్ణ తెలిపారు. బయనపల్లె గ్రామంలోని వెంకట లక్షుమ్మ ఇంట్లో రేషన్ బియ్యం ఉండగా దాడులు జరిపి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

## పాలకవర్గ ప్రమాణస్వీకారం

దువ్వూరు, డిసెంబరు 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఎడమడక గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ ఆలయ ఛైర్మన్‌గా నగిరి శ్రీకాంత్ శనివారం దేవాదాయశాఖాధికారి నర్సింహాన్‌సింద్ ప్రమాణం చేయించారు. సభ్యులుగా చిన్న వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసమ్మ, గంగమ్మ, రామలక్షుమ్మలు ప్రమాణం చేసినట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

కమలాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలోని సీఎస్ఐ చర్చ్ ప్రాంగణంలో డిసెంబరు 23న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఖరారు కావ డంతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి శని వారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సభను విజయవంతం చేయాలని అధికారులకు, నాయకులకు సూచించారు. కమలాపురంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేయనున్నారని, ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆరుగురు జూదరులు అరెస్ట్

కమలాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:

కమలాపురం పోలీసుస్టేషన్ పరిధిలో అయ్యప్ప స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3570 సీజ్ చేసినట్లు ఎస్సై చిన్న పెద్దయ్య తెలిపారు.

## ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

కడప క్రైం, డిసెంబరు 17, ప్రభాతవార్త:



రాజస్తాన్ రాష్ట్రం రాజ్సమంద జిల్లా, రాజ్‌నగర్ గ్రామానికి చెందిన బబ్లు (22) జీవనోపాధి నిమిత్తం కడప ఆలంఖాన్‌పల్లె లో సుమారు నాలుగు నెలల క్రితం వచ్చాడు. ఇటీవల రాజస్తాన్‌కు వెళ్లి తిరిగి 16వ తేదీ ఆలంఖాన్‌పల్లెకు వచ్చాడు. తన నివాసంలో శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తాలూకా సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నగల బ్యాగు పోగొట్టుకున్న మహిళ

### - 30 నిమిషాల్లో ఛేదించిన పోలీసులు

కడప క్రైం, డిసెంబరు 17, ప్రభాతవార్త:



ఆటోలో వెళ్తూ రూ.1.62లక్షలు విలువైన బంగారు, వెండి కలిగిన బ్యాగును పోగొట్టుకున్న ఘటన శనివారం నగరంలో చోటు చేసుకుంది. కడప వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు రాయ చోటి కాటి మానుకుంటకు చెందిన షేక్ అస్మా అనే మహిళ శుభ కార్యానికి వచ్చి తిరిగి రాయచోటి వెళ్లేందుకు చిలకల బావి వద్ద ఆటోలో పాత బస్టాండుకు బయల్దేరింది. అయితే బస్టాండు వద్ద ఆటోలో తన లగేజీ బ్యాగును మరిచి పోయింది. గుర్తించిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐడీ పార్టీ సిబ్బంది ఖాదర్ హుసేన్, కిరణ్‌లను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. కేవలం 30 నిమిషాల్లో ఆటోను గుర్తించి బాధితు రాలికి బ్యాగును అప్పగిం చినట్లు సీఐ తెలిపారు. కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## సారాయి స్వాధీనం- వ్యక్తి అరెస్టు

కేవి.పల్లె, డిసెంబరు 17 ప్రభాతవార్తః



మండలంలోని సిబ్బావాండ్లపల్లె వడ్లకుంటలో శనివారం దాడులు నిర్వహిం చగా బాబు అను అతని వద్ద మూడు లీటర్ల సారాయి కలిగి ఉండగా అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని పీలేరు ఎస్ఈబీ సీఐ గురుప్రసాద్ తెలిపారు. ఈదాడిలో ఎస్ఈబీ సిబ్బంది రాఘవయ్య, యోగానంద, సురేష్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ప్రమాదాలు అరికట్టాలి

ఓబులవారిపల్లె, డిసెంబరు 17, ప్రభాతవార్త:

కడప - చెన్నై ప్రధాన రహదారిలో రెడ్డికట్ట వద్ద నుంచి రైల్వేకోడూరు పట్ట ణం వరకు రాత్రింబవళ్లు బెరైటీస్ వాహనాలు రవాణా సాగించడంతో దుమ్ము కాలుష్యం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలను అరికట్టే అధికారులు లేరా అంటూ ప్రజలు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా సంబంధిత అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు చొరవ చూపి రోడ్డు ప్రమా దాలపై దృష్టి సారించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరు తున్నారు. ఓ పక్క వాహనాలు అతి వేగం, మరో పక్క దుమ్ము దూళి చిన్న చిన్న వాహనాలు ప్రయాణించడంతో ఎక్కడ ఎప్పుడు ఎలా ప్రమాదం ముంచు కొస్తుందో అని ప్రయాణికులు బిక్కు బిక్కుమంటూ రోడ్డుపై ప్రయాణించాల్సి వుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా సంబం ధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

## పీడీ యాక్ట్ నమోదు

కడప క్రైం, డిసెంబరు 17, ప్రభాతవార్త:

కడపలో నివాసముంటున్న కొత్తపల్లి రఘురామిరెడ్డి అక్రమ సారా వ్యాపారం చేస్తుండడంతో అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరిగింది. బందిపోటు, మాదక ద్రవ్య నేరస్థులు, గూండాలు, వ్యభిచార నరస్తులు మరియు భూ కబ్జా దారులు, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం 1986లోని సెక్షన్ 3(1) 3(2) ప్రకారం పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని ఎస్పీ శనివారం తెలిపారు. రఘురామిరెడ్డి సారా వ్యాపారం చేస్తూ పలు నేరాలకు పాల్పడడంతో అతనిపై పీడీ యాక్ట్‌కు కలెక్టరుకు ప్రతిపాదించడంతో కలెక్టర్ ఆమోదించడంతో అతనిపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు తెలిపారు.

## స్మార్ట్ సిటీస్ సర్వేలో పాల్గొనాలని పిలుపు

కడప కార్పొరేషన్, డిసెంబరు 17, ప్రభాతవార్త:

స్వచ్ఛ సర్వేక్షణ-2022లో భాగంగా గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇస్ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-22 ర్యాంకింగ్‌లో కడప నగరం మెరు గైన స్థానాన్ని సాధించడంలో ప్రజలందరూ సహకరించాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్ కోరారు. ప్రతి ఒక్కరూ అవగాహన సర్వేలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యకలాపాల పట్ల మా బృందం సభ్యులు అత్యంత బాధ్యత వహిస్తారన్నారు.

## దోమల నివారణకు ముమ్మరంగా ఫాగింగ్

తంబళ్లపల్లె, డిసెంబరు 17, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల కేంద్రంలో దోమల నివారణకు సర్పంచ్‌లు నీలూమైను ద్దీన్ ఆదేశాల మేరకు ముమ్మరంగా ఫాగింగ్ చేయించారు. కోసువారిపల్లె డా.నిరంజన్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో దోమల నివారణకు వైద్యసిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీహెచ్‌వో వెంకట రమణను ఆదేశించారు. గ్రామాల్లో వ్యక్తిగత శుభ్రత, పరిసరాలు శుభ్రంగా ఉంచు కొని తాగునీరు కాచి వడబోసి తాగానాలని దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాభావంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుందని తాగునీటి వనరులు క్లోరినేషన్ కచ్చితంగా చేయించి పరిశుభ్రతపై సూచనలు చేయాలని హెచ్చరించారు.

## చిట్వేలి మహా పాదయాత్రకు తరలిన మండల భక్తులు

చిట్వేలి, డిసెంబరు 17

ప్రభాతవార్త




చిట్వేలి మండల పరిధిలోని వందలాది మంది భక్తులు తిరుమ లకు తొమ్మిదోసారి మహాపాద యాత్రకు శనివారం తరలివెళ్లారు. భక్తులు మాట్లాడుతూ రాజంపేట మండలం చెర్లోపల్లె గ్రామానికి చెందిన శ్రీశ్రీ దేవరకొండ భానుమూర్తిశర్మ ఆధ్వర్యంలో శని వారం చేపట్టిన 30వ సారి తిరుమల మహా పాదయాత్రకు మేము తరలివెళ్లడం ఇది తొమ్మిదోసారి అని అన్నారు. మొదట ఇద్దరితో ప్రారంభమైన మా యాత్ర వందలాది మందితో కొనసాగుతూ ఉందని అన్నారు. గోవింద మాలలు ధరించి ఇరుముడులు మోసుకొని గోవిందా గోవిందా అంటూ తిరుమలకు పాదయాత్రగా తరలి వెళుతున్నామన్నారు. దైవయాత్రను తలపెట్టిన భక్తులకు మార్గమధ్యంలో పలువురు అలా ్పహారం, భోజన వసతులు కల్పించారు.

## ప్రజలకు తాగునీరు అందించడం అభినందనీయం

ఓబులవారిపల్లె, డిసెంబరు 17, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఖాతాలో జమ చేయకున్నా ఎంతో కష్టకాలంలోనూ పంచాయతీ సర్పంచ్‌లు ప్రజలకు దాహార్తిని తీరుస్తూ మంచినీరు అందించడం ఎంతో అభినంద నీయమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఓబులవారి పల్లె సర్పంచ్ జయపాల్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులున్నా గ్రామాల్లో తాగునీటి సమస్య, మంచినీటి పైపులైన్ లీకేజీలకు సంబంధించి, పారిశుద్ధ్యం పనుల మరమ్మతులు చేయించి ప్రజలకు సౌకర్యార్థం తమ వంతు కృషి చేస్తున్నారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓబులవారిపల్లె పంచాయతీ లోని రైస్ మిల్లు వద్ద విద్యుత్తు మోటారు చెడిపోవడంతో కొత్త మోటారు బిగించారని గ్రామస్థులు తెలిపారు.

## ప్రమాదకరంగా రోడ్డుపై గుంత

పెద్దమండ్యం డిసెంబర్ 17 ప్రభాతవార్త



మాండూస్ తుఫాన్ కారణంగా పడిన వర్షాలకు పెద్దమండ్యం కుషావతీ నదిపై ఉన్న వంతెనకు పెద్ద అగాధం ఏర్పడింది. ఇప్ప టికే రెండు ఆటోలు ప్రక్కకు ఒరిగి ప్రమాదం నుండి తప్పించు కున్నారు. అయితే అధికారులు చోద్యం చూస్తు మరమ్మత్తులు చేయ లేదని ప్రజ లు విమర్శలు గుప్పిస్తున్నారు. కంకర పోయి పెద్దరాళ్ళుతేలి రాకపోక లకు తీవ్ర అంతరాయం కలుగుతుందని అంటున్నారు. తెలియనివారు రాత్రివేళల్లో డౌను కారణంగా వాహనం కంట్రోల్ తప్పి ప్రమాదం బారీన పడి ప్రాణాపాయం జరగవచ్చు. అధికారులు ముందస్తు చర్యలుచేపట్టి గుంతనుపూడ్చి ప్రమాదబారీన పడకుండా కాపాడలని వాహన దారులు ప్రజలు కోరుతున్నారు.

## పాకిస్తాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ

రాయచోటి.డిసెంబర్ 17 ప్రభాతవార్త



భారత ప్రదాని నరేంద్ర మోదీపై ఐక్యరాజ్యసమితి సమావేశంలో పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్‌బుట్టో జర్దారి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సోమువీర్రాజు ఆదేశాలమేరకు రాయచోటి పట్టణ అధ్యక్షులు నిర్మలకుమార్ ఆద్వర్యంలో శని వారం బారీ నిరసనా ర్యాలీ చేసిన బీజేపి కార్యకర్తలు. భారతమాతాకి జై, పాకిస్తాన్ డౌన్‌డౌన్ నినాదాలతో మారుమ్రోగిన రాయచోటి పట్టణం. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ మీదుగా నేతాజి విగ్రహం వరకు కొనసాగిన ర్యాలీ నేతాజి కూడలి వద్ద మానవహారం అనంతరం బుట్టోజర్దారి దిష్టిబొమ్మ దగ్దం చేశారు. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి తక్షణమే మోదీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలిటికల్ సలహాకమిటి సభ్యులు సాయిలోకేష్, బీజేపి మేదావుల విభాగపు సభ్యుడు డా.శ్రీనివాసరాజు, బీజేపి సీనియర్ నాయకులు శివగంగిరెడ్డి, పట్టణమైనార్టీ మోర్చా అధ్యక్షుడు షాహీద్, రాజశేఖర్, బీజేపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైష్ణవి దేవాలయాల దర్శనం పరమ పవిత్రం

పీలేరు, డిసెంబరు 17 ప్రభాతవార్తః

ధనుర్మాసంలో భక్తులు వైష్ణవి దేవాలయాలను సందర్శిస్తుంటారు. కావున భక్తులు,ప్రజలుకు సన్నిహితంగా ఆర్టీసీ యాజమాన్యం పలువైష్ణవి దేవాలయంలో భక్తుల దర్శనార్ధం ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజరు బండ్లకుమార్ తెలిపారు. శ్రీనివాసమంగాపురంలో శ్రీకళ్యాణవెంకటేశ్వరస్వామి దర్శనం, తిరుచా నూరులో అలిమేలు మంగాపుం శ్రీపద్మావతిదేవి అమ మ్మవారు దర్శనం, అప్ప లాయగుంటలో శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనం, నారాయణవనంలో శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి, నాగలాపురంలో వేదనారాయణస్వామి దర్శనం జరుప బడునని తెలిపారు, ప్రయాణ చార్జీలు పెద్దలకు రూ.450, పిల్లలకు రూ.250లు మాత్రమే, తదుపరి భోజనం, టిఫెన్ ఖర్చులు ప్రయాణికులే భరించుకోవలెనని తెలిపారు. టిక్కెట్లు ఆన్‌లైన్ నందు బుక్ చేసుకోవలెనని సూచించారు.

## శర వేగంగా డ్రైనేజీ పనులు

వాల్మీకిపురం, డిసెంబరు 17 ప్రభాతవార్తః



పట్టణంలోని నాయక్ వీధి ప్రాంతం ఇటీవల అభివద్ది చెంది నివాసముండే ఇళ్ల విస్తరించారు. దీంతో ఈ ప్రాంతంలో మురుగునీరు పారేందుకు డ్రైనేజీ లేక పోవడంతో ఈప్రాంత ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. ఈక్రమంలో మురుగునీరు అంతా రోడ్డుపై గుంతలు ఉండ డంతో ఇందులోనూ మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతుంది. ఈసమస్య పరిష్కరించాలని కోరుతూ ఈప్రాంత మైనారిటీ నాయకులు శనివారం స్థానిక ఎమ్మెల్యే దష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే డ్రైనేజీని మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో పాటు తక్షణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఉదయ్‌కుమార్, ఉప సర్పంచి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మార్టు ద్వారా నిత్యావసర సరుకులు

వాల్మీకిపురం, డిసెంబరు 17 ప్రభాతవార్తః



పట్టణంలో నిర్వహిస్తున్న చేయూత మహిళా మార్టు ద్వారా సరసమైన ధరలకే నిత్యావసర సరుకులు అందుబాటులో ఉన్నాయని వీటిని పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని చేయూత మహిళా మార్టును ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు, సరసమైన ధరలకు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని మహిళా సంఘాలతో పాటు ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ది పొందాలని సూచించారు మార్టు ద్వారా రూ.1000లకు వస్తువులును కొన్నవారికి ఒక బాక్సును ఉచితంగా ఇవ్వ దం జరుగుతుందని, రూ.3వేలు పైగా కొనుగోలు చేసినవారికి ఒక చీర ఉచితం గా అందించడం జరుగుతుందన్నారు. మహిళలు తయారుచేసిన నాణ్యమైన వస్తువులను సైతం ఇక్కడ విక్రయించడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటరమణ, ఏపీఎంలు నరసింహులు, సుజాత, శ్రీనివాసులు, గంగులప్ప, శంకర, మహేశ్వరి పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం

వాల్మీకిపురం, డిసెంబరు17ప్రభాతవార్తః



ప్రభుత్వాసుపత్రిలో నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం అందుబాటులో ఉందని ప్రజలంతా ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి న అవసరం ఉందని అన్న మయ్య జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్ర శేఖర్ అన్నారు. శనివారం స్తానిక ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను తనికీచేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్తానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతి వార్డులు, ఈసీజీ, ఎక్స రే వార్డులు నూతనం గా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి భవనాలను ఆయన తనిఖీచేశారు. అనం తరం వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచా లని, శస్త్రచికిత్సలు, రక్తకణాల పరీక్షలు, కిడ్నీ, కాలేయ, రక్తపు గ్రూపు, రక్త హీనత, హిమోగ్లోబిన్, మధుమేహం పరీక్షలను వేగవంతం చేసి నిర్ణీత సమయా నికి ఫలితాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిం టెండెంట్ ఫైరోజాబేగం, వైద్యులు సోనీ, లైఖ్య, గురుస్వామి, హర్షితరెడ్డి, సిబ ్బంది పాల్గొన్నారు.

## హక్కుల పరిరక్షణ కోసం కలిసి పనిచేద్దాం

వాల్మీకిపురం, డిసెంబరు 17 ప్రభాతవార్తః

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు వారి హక్కుల పరిరక్షణ కోసం కలిసి పనిచేద్దామని వాల్మీకిపురం తాలూకా విశ్రాంత ఉద్యోగుల అసోసి యేషన్ అధ్యక్షులు మస్తాన్‌వలి అన్నారు. శనివారం స్థానిక సత్యసాయి సేవా మందిరం ఆవరణంలో అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం పురస్క రించుకుని తాలూకా స్తాయి విశ్రాంతి ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహిం చారు. ఈసమావేశాన్ని ఉద్దేశించి మస్తాన్‌వలి మాట్లాడుతూ ఆదాయపు పన్నులో టాక్సు లేకుండా ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని , పెరివిజన్, పెండింగ్‌లో ఉన్న డీఏ తక్షణమే అందేలా ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకుపోతా మన్నారు. విశ్రాంత ఉద్యోగులంతా ఒకే ట్రాక్‌పై వచ్చి మన సమస్యలు పరిష్కారం కోసం మనమే కషిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు శంకరయ్య, గౌరవాధ్యక్షులు రమణ, సంఘం నాయకులు శంకర్‌రెడ్డి, గోపాలకష్ణ మూర్తి, వెంకటరమణ, అహ్మద్‌బాషా, వెంకటరెడ్డి, నాగరాజు, రాజగోపాల్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## శిక్షణా నైపుణ్యాలతో ఉద్యోగాలు సాధించుకోవాలి

రాయచోటి టౌన్.డిసెంబర్ 17 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ది సంస్థ నాంధీ పౌండేషన్ ఆద్వర్యంలో స్థానిక షిరిడిసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఎంపా ్లయి బిలిటి స్కిల్స్, కమ్యు నికేషన్ అండ్ ఇంగ్లీస్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై ఆరు రోజులు పాటు శిక్షణా కార్య క్రమం జరిగింది. ఆరు రోజులు శిక్షణ పూర్తయిన సందర్బంగా శిక్షణ తీసుకున్న విద్యార్థులకు నాంది పౌండేషన్ వారి ఆద్వర్యంలో సర్టిఫికేట్‌లు ఇవ్వడం జరి గింది. కార్యక్రమంలో సచివాలయం శాఖ జిల్లా అధికారి మనోహర్ రాజు రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ది సంస్థ డిస్ట్రిక్ట్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అధికారి హరిక్రిష్ణ, కళాశాల ప్రిన్సిపల్ వెంకటచలమారెడ్డి పాల్గొన్నారు. సచివాలయ శాఖ జిల్లా అధికారి మనోహర్ రాజు మాట్లాడుతూ తృతీయ సంవ త్సరం విద్యార్థులు రాబోయే రోజులలో జరిగే క్యాంపస్ డ్రైవ్‌లలో పాల్గొని ఉపాధి పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే విశ్వనాధరెడ్డి వర్ధంతి వేడుకలు

వీరబల్లి.డిసెంబర్ 17 ప్రభాతవార్త



మండల కేంద్రంలో మాజీఎమ్మెల్యే గాలివీటి విశ్వనాధరెడ్డి 6వ వర్ధంతి వేడుక లను శనివారం తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కడప జిలా ్ల పరిషత్ చైర్మన్ అమర్‌నాధరెడ్డి లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి హాజరుకావడం జరిగింది. దివంగత కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే విశ్వనాధరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు అభిమానులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని గాలవీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాద్‌రెడ్డి, యువనాయకులు మదన్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తో కలసి నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు, సర్పంచ ్లు, ఎంపిటిసిలు, సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## టిడిపి మండల ఆర్గనైజర్ సెక్రటరీగా కిరణ్

రామాపురం.డిసెంబర్ 17 ప్రభాతవార్త



మండలంలోని రాచపల్లి పంచాయతీ బీదవాండ్లపల్లి కి చెందిన కిరణ్‌కుమార్ నాయుడుని తెలుగుదేశం మండల తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియ మించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తనను గుర్తించి తనకు పదవి ఇచి ్చందని కష్టపడి పనిచేసి రాబోవు ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి నియోజకవర్గ బాధ్యుడు రమేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మహిమాణ్విత శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గోపవరం,డిసెంబర్ 17 ప్రభాతవార్త;



మండలంలో వల్లెరవారిపల్లెకు సమీపాన వెలసిన మహిమాణిత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి మార్గశిర మాస నాల్గవ శనివారం అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు.కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమానికి పరి సర గ్రామాలనుంచి అదిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్ధ ప్రసాదాలను స్వీక రించారు. వీడియో కాల్ ద్వారా సుదూర ప్రాంతాలనుంచి రాజకియ నాయకులు, సినీ ప్రముఖులు, స్వామి కార్యక్రమాన్ని దర్శించుకొన్నారు. ఆలయ పూజారి శ్రీ పెంచలయ్య స్వామి భక్తి శ్రద్దలతో కార్య క్రమాన్ని నిర్వహించారు.ఎన్నో ఇబ్బం దులు ఎదుర్కోంటున్న అభాగ్యులు శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కన్నుల పండువ గా వీక్షించి తరిస్తూన్నారు. కాగా ధర్మశెట్టి ఆదిలక్షుమ్మ కుమారులు వెంకట సుబ్బయ్య, ధర్మపత్ని శ్రీలక్ష్మిలు అన్నదానానికి అవసరమైన ఆర్ధిక సహాయాన్ని అందచేసారు. కార్యక్రమంలో తెలంగాణాకు చెందిన వ్యవసాయాదికారి శివ గోవర్ధన్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, సుబ్బరాజ, పాల్గోన్నారు.

## మాచర్ల విధ్వంసమే వైకాపాకు ప్రజా సమాధి : టిడిపి

బి.కొత్తకోట డిసెంబర్ 17, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మాచర్లలో తెలుగుదేశం పార్టీ నాయకు లపై చేసిన విధ్వంసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి భవిష్యత్తులో ప్రజలు సమాధి కట్టడం ఖాయమని తెదేపా కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం పర్వీన్ తాజ్ జోష్యం చెప్పారు. శనివారం ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ తుగ్లక్ పాలనతో విసిగిపోయారని నేడు మా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు వస్తున్న ప్రజాదరణ చూసి బెంబేలెత్తుతున్నట్లు చెప్పారు. మాచర్లలో వైకాపా నాయకులు ప్రజాస్వామ్యా నికి పాతర వేసి అపహాస్యం చేశారని ప్రజలే వారికి తగిన సమాధానం చెప్తారని జగన్ 175కు 175 కావాలన్నారు ముందస్తుగా పులివెందుల కాపాడుకోవాలని హెచ్చరించారు. మాచర్లలో టిడిపి నాయకులు పై దాడి చేసిన వైకాపా నాయకుల పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట చావిడి కిట్టన్న, ప్రభాకర్, పట్టా, చంద్రమోహన్ రెడ్డి, మదార్ సాబ్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సైన్స్‌ఫైర్..

పెండ్లిమర్రి, డిసెంబరు 17, ప్రభాతవార్త:



మండల స్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా జరిగింది. ఎంపీడీవో అల్తాఫ్ హుసేన్ సైన్స్ ఫేర్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తయా రు చేసిన వివిధ రకాల నమూనా ప్రాజెక్టులు పరిశీలించి అభినందించారు. మరింత ఉన్నతంగా ఎదగాలని వారిని ప్రోత్సహించారు. అత్యుత్తమ 5 ప్రాజెక్టు లను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో సుజాత, హెచ్ఎం శంకరాచారి, అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటిని తొలగించే శాశ్వత చర్యలు చేపట్టండి : సిపిఐ

కమలాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:



కమలాపురం మండలం గోపులారం రైల్వే వంతెన కింద చాలా రోజుల నుంచి నీరు నిల్వ ఉందని దీని వల్ల గోపులా పురం పాచికలపాడు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శులు కొమ్మది ఈశ్వరయ్య, నాగేశ్వరరావులు అన్నారు. శనివారం గోపులాపురం రైల్వే వంతెన కింద స్థానిక రైతులతో కలిసి నీటిలోనే నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం వచ్చిన ప్రతి సారి నీరు వంతెన కిందికి చేరడంతో దాదాపు నాలుగు అడుగుల లోతు నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో దశల వారీ ఆందో ళనలకు సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్, స్థానిక రైతులు నవనీశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, శివరామి రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, ఓబులేసు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

కమలాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో 66వ రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు శనివారం ముఖ్య అతిథిగా వచ్చిన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్ర నాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డిలు జాతీయ జెండాను ఎగురవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. శాంతి కపోతాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమలాపురం రాష్ట్ర స్థాయి పోటీలకు వేదిక కావడం ఎంతో గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తిరాజు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జిలానీబాషా, వైఎస్ఆర్‌సీపీ మండల నాయకులు ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజ శేఖర్‌రెడ్డి, ఆర్.వి.ఎన్.ఆర్.నిఖిల్, టోర్నమెంట్ ఆర్గనైజర్ శివశంకర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఈ క్రీడా పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు తిరు పాల్‌రెడ్డి, బాబు,హేమారెడ్డి, జయకుమార్, అంకాలరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మాధవి, సరిత, సుమలత, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అరవీడులో బయల్పడిన శిలాశాసనాలు

గాలివీడు.డిసెంబర్ 17 ప్రభాతవార్త

అరవీడు గ్రామంలో బయల్పడిన శిలా శాసనాలు ఆసక్తినిరేకెత్తిస్తున్నాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గాలివీడు మండలం అరవీడు గ్రామం కూర్మాయగారిపల్లి పంటపొలాల్లో బయల్పడిన శిలాశాసనాలు తెలుగుబాషలో 9వ శతాబ్దపు పూర్వపు అక్షరాలలో రాయబడినదిగా తెలుస్తోంది. ఈ శాసనాలను పరిశీలిస్తే వైదుంబరాజు గండ త్రినేత్రానికి చెందినదిగా నిపుణులు పేర్కొంటు న్నారు.

## పటిష్టమైన కార్యాచరణతో సత్ఫలితాలు

కమలాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:

కమలాపురం నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షఫీ ఆధ్వర్యంలో క్లీన్ ఏపీ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణం లోని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, నగర పంచాయతీ కార్మికులు, సిబ్బంది హాజరయ్యారు.శానిటరీ ఇన్‌స్పెక్టర్ షఫీ మాట్లాడుతూ స్వచ్ఛ కమలాపురం సాధించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ మాజీ స్పీకర్

బద్వేలు అర్బన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :



ధనుర్మాసం పురస్కరించుకొని శనివారం పట్టణంలోని సిద్దవటం రోడ్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయాంజనేయ స్వామి దేవాలయంలో తెల్లవారుజామునే ఆలయ అర్చకులు వీరేశాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు పలు రకాల విశేష పూజలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ మధుసూదన్ ఆచారి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు మరియు కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికి స్వామివారి సన్నిధిలో శాలువా, పూల మాలలతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకట రమణ, నిమ్మకాయల గురివిరెడ్డి, శివారెడ్డి, జయరాం, బండారు సురేష్ బాబు, మెంటా నాగేంద్ర, తాతనబోయిన వెంకట సుబ్బయ్య, కనమర్లపూటి మస్తాన్ రాజా, వల్లంకొండు శివతో పాటు మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, తులసి వెంకట శివ నారాయణ, కలసపాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మలిపెద్ది రాజా, సుబ్రమణ్యంతో పాటు పలువురు కమిటీ సభ్యులు, ఆలయ మేనేజర్ వెంకటరమణ, హరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

– మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :



వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఉదయం మున్సిపాలిటీలోని ప్రత్యేక శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పలు వార్డుల యందు చేపట్టి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలలో మున్సిపల్ సిబ్బంది ద్వారా బ్లీచింగ్, సున్నం చల్లించి, అనంతరం పుర వీధులలో ర్యాలీ చేపట్టారు. క్లాప్ క్వీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఎవరి ఇంటి వద్ద వారు పరిశు భ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరు బుట్టలలో వేసి పారిశుద్ధ్య వాహనాలు వచ్చినపుడు పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలు ఏర్పడితే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ మేనేజర్ మునికుమార్, మెప్మా అధికారి అయ్యావారయ్య, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## తరగతి బోధనలలో సహకారం కోసమే టీచర్ టూల్ శిక్షణ

రాయచోటి.డిసెంబర్ 17 ప్రభాతవార్త



తరగతి గదిబోధనలో ఉపాద్యాయులకు సహకారం కోసమే టీచర్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాస్టర్ ట్రైనర్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. బోధన సాధనల ఆధారంగా తరగతి గది పరిశీలన అనే అంశంపై రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాద్యాయులకు ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శిక్షణా కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో తరగతి గదిలో అభ్యసనా వాతావరణాన్ని ఎలా కల్పించాలి, విద్యార్థుల సామాజిక భావోద్వేగాలను దృష్టిలో ఉంచుకుని బోధనా కార్యక్రమం చేపట్టడం ఎలా వంటి విషయాలను చర్చించడం జరుగుతోందన్నారు. ప్రధానోపాద్యాయులు శిక్షణను నేర్చుకున్న అంశాల ఆధారంగా తరగతి గదిలో జరిగే బోధన అభ్యసన గురించి నిరంతరం పరిశీలన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలును సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ నాగేశ్వరరావ్, మాస్టర్ ట్రైనర్స్ జయచంద్ర, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమిలేదు

రామాపురం.డిసెంబర్ 17 ప్రభాతవార్త



వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమిలేదని టీడీపి నాయకులు వై.వెంకటసుబ్బారెడ్డి, చంద్రశేఖర్, వెంకట్రామరాజు, మల్లిఖార్జునలు కలిసి అన్నారు. మండలంలోని గోపగుడిపల్లి కల్పనాయుని చెరువు గ్రామాలలో శనివారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని రాయచోటి నియోజవకర్గం టీడిపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు ఇదేమి కర్మ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ఒక అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. నేటికి ప్రభుత్వ ఉద్యోగాలకు, పింఛన్‌లకు జీతాలు అందించడం లేదని ప్రభుత్వం తీరు చూస్తే ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇంతటి అవినీతిరాజ్యపాలన ఎన్నడూ చూడలేదన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు వాసుదేవులు, గంగయ్య, కే.శ్రీరాములు, రాజశేఖర్, పెద్దసుబ్బయ్య, అబ్బు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాత నేరస్థులు పద్ధతులు మార్చుకోండి

సిఐ విశ్వనాధ్‌రెడ్డి

రైల్వేకోడూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలో ఉన్న పాత ఎర్రచం దనం నిందితులు పద్ధతులు మార్చుకోవాలని లేనిపక్షంలో కఠినమైన చర్యలు ఉంటాయని కోడూరు సిఐ ఎస్.విశ్వనాధ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు అటవీ సమీప గ్రామాల్లో ఎర్రచందనంపై ప్రత్యే కంగా గ్రామస్థులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు ఎర్రచందనం జోలికి వెళితే కఠినమైన చర్యలు ఉంటాయని, వారి ప్రవర్తన మార్చుకొని సత ప్రవర్తనతో జీవించాలన్నారు. ఎవరైనా ఈజీ మనీ కోసం ఎర్రచం దనం జోలికి వెళితే శిక్షలు ఘోరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎస్‌ఐలు మోహన్‌కుమార్‌గౌడ్, ఎస్‌ఐ–2 వెంకటేశ్వర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారిశాలలో ప్రారంభమైన ధనుర్మాస పూజలు

వేంపల్లె, డిసెంబరు 17, ప్రభాతవార్త :



వేంపల్లెలోని అమ్మవారిశాలలో శనివారం నుండి ధనుర్మాసపూజలు ప్రారంభించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వడ్లకుంట రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అర్చకుల నేతృత్వంలో ఉదయం 5.00గంటలకు వాసవిమాతకు పంచహారతులు, మంత్రపుష్పం, తదితర విశేష పూజలు అనంతరం అమ్మవారిని పల్లకిలో కూర్చోబెట్టి భక్తులు భుజాలపై ఎత్తుకుని ప్రాకారోత్సవం నిర్వహించారు. వచ్చేనెల 14వ తేదీ వరకు పూజలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో గండి శ్రీవాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు బైరిశెట్టి బాలగంగాధర్, గండి వీరాంజనేయస్వామి దేవస్థాన ఛైర్మన్ పినుపోలు రాఘవేంద్రప్రసాద్, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు బాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అధికార అండతో దాడులు చేయడం శోచనీయం

వేంపల్లె, డిసెంబరు 17, ప్రభాతవార్త :



వైకాపా నేతలు అధిక అండతో, అహంకారంతో టీడీపీ నేతలపై దాడులు చేయడం శోచనీయం అని టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహమ్మద్ షబ్బీర్‌లు పేర్కొన్నారు. వేంపల్లెలో శనివారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. వైకాపా నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. అధికార దర్పంతో ప్రతిపక్షాలను అణగదొక్కి వైకాపా నేతలు దాడులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా స్వామ్యంలో ఏ పార్టీ వారికైనా వారి కార్యక్రమాలు చేసుకునే హక్కు ఉంటుందన్నారు. రాష్ట్రంలో అరాచక రాజ్యం ఏలుతుందనేందుకు మాచర్లలో టీడీపీ నాయకులపై జరిగిన దాడులే నిదర్శనం అని వారు అన్నారు. వైకాపా ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక మాచర్ల ఎమ్మెల్యే ఇటువంటి అరాచకాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో పాపిరెడ్డి, మహమ్మద్, ఇదాయతుల్లా, సుధాకర్‌రెడ్డి, గోగుల మల్లికార్జున, వీరభద్ర, దక్కారమేష్, పోతిరెడ్డి శివ, ఆనం లక్ష్మినారాయణ, అంబవరం గిరిధర్‌రెడ్డి, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికి శుద్దిజలం అందించడమే ధ్యేయం

–ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి.డిసెంబర్ 17 ప్రభాతవార్త



రాయచోటి నియోజవర్గ ప్రజలందరికి శుద్దిజలం అందించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అ న్నారు. శనివారం రాయచో టి పట్టణంలోని 31,32వ వార్డులో సయ్యద్ యూసుఫ్ షా ఖాద్రి వీధిలో వేరు వేరు గా ఏర్పాటు చేసిన 2వేల ఎల్‌పిహెచ్ సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్‌లను శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ ప్రాంతాలలో మినరల్ వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు కావడంతో ఆ ప్రాంతంలో ప్రజలలో ఆనందం వ్యక్తమయింది. తమకు శుద్ధి జలం అందించినందుకు మినరల్‌వాటర్ ట్యాంక్‌ల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే, స్థానిక కౌన్సిలర్‌లకు ఆ ప్రాంత ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, కౌన్సిలర్ గువ్వల లక్ష్మీదేవి, బుజ్జిబాబు, వైఎస్సార్‌సిపి మదనపల్లి నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, అలీనవాబ్‌ఖాన్, బేపారి మహమ్మద్ ఖాన్, మదనమోహన్‌రెడ్డి, ఫయాజ్‌అహమ్మద్, అల్తాఫ్, ఆసీఫ్ అలీఖాన్, మార్కెట్‌కమిటి వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ సభ్యులు జాకీర్‌హుస్సేన్, నవరంగ్ నిస్సార్, కొలిమిచాన్‌బాష, ఎస్‌పిఎస్ రిజ్వాన్, రియాజ్, గౌస్‌ఖాన్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, జానం రవీంద్రయాదవ్, అన్నాసలీం, జయన్ననాయక్, భాస్కర్, జబీవుల్లా, హజరత్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## పాతబజారులో డ్రైనేజి పనులు ప్రారంభం

తోట శివసాయి

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 17 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని పాతబజారులో శనివారం డ్రైనేజి పనులను రైల్వేకోడూరు ఉపసర్పంచ్ తోట శివసాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతి అధికారుల పర్యవేక్షణలో చక్కటి మార్కింగ్ ద్వారా ఆర్యవైశ్యుల విజ్ఞప్తి మేరకు డ్రైనేజి పనులను శనివారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గతంలోనే డ్రైనేజి ఉన్నదని, కొంత డ్రైనేజిని ఆక్రమణ చేసి కట్టడాలు కట్టిన నేపథ్యంలో రోడ్డుపై ఉన్న వర్షపునీరు వాహనదారులకు, పాదచారులకు ఇక్కట్లుగా ఉన్న సందర్భంలో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలోని ఈ పనులను నిర్వహిస్తున్నామని ఉపసర్పంచ్ సాయి తెలిపారు. ఎంతో కాలంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించిన పంచాయతి అధికారులు డ్రైనేజిని ఏర్పాటు చేసి వేగవంతంగా పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ డైరెక్టర్ గునిశెట్టి ప్రశాంతిరమేష్, భుజంగేశ్వర దేవాలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడు, మాజీ ఆర్యవైశ్య నాయకులు మేడా వెంకటసుబ్బయ్య, సిహెచ్ రమేష్, హరి, మల్లెంకొండు నవీన్, ఇఒ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు శిక్షణలో నేర్చుకున్న అంశాలతో రాణించాలి

పులివెందుల, డిసెంబరు 17, ప్రభాతవార్త :

విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న అంశాలతో బాగా రాణించాలని పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్ఎస్ రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డిలు అన్నారు. ఈ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళి ఆధ్వర్యంలో అనంతపురంలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో మెషిన్ లెర్నింగ్ విత్ పైథాన్ అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. ఈ శిక్షణకు హాజరైన విద్యార్థులను వారు అభినందించారు.కార్యక్రమంలో అధ్యాపకులు భవ్య, విద్యార్థులు కార్తీకా, రామ్మోహన్, హరీష్, స్నిగ్ధా, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయం-1లో గడప గడప కార్యక్రమం

పోరుమామిళ్ళ రూరల్, డిసెంబర్ 17ప్రభాతవార్త:

పోరుమామిళ్ళ గ్రామ పంచాయతీలోని గ్రామ సచివాలయం–1లో శనివారం గడప గడప ప్రోగ్రాంలో భాగంగా నవరతా ్నలులోని సంక్షేమ పథకాల గురించి బద్వేలు నియోజకవర్గ శాసనసభ సభ్యురాలు డాక్టర్ సుధ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పీటిసి ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు సిఎం బాష, చెన్ను రాజశేఖర్, నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రాళ్లపల్లి నరసింహులు, ఎంపిడివో నూర్జహాన్, వైఎస్సార్ సిపి నాయకులు రాజీవ్ బాషా, కార్యకర్తలు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో ఘనంగా విద్యుత్తు పొదుపు వారోత్సవాలు

రాజంపేట అర్బన్, డిసెంబరు 17 ప్రభాతవార్త



రాజంపేటలో విద్యుత్తు పొదుపు వారోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. వారోత్సవాల్లో భాగంగా రాజంపేట డివిజన్ విద్యుత్తుశాఖ ఇఇ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది డివిజన్ కార్యాలయం నుంచి పాతబస్టాండు కూడలి వరకు ఆ తర్వాత ఆర్‌టిసి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలు విద్యుత్తు పొదుపుగా వాడుకోవాలని ప్లేకార్డులతో, బ్యానర్లతో ర్యాలీలో అధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా త్రిస్టార్ రేటింగ్ ఉన్న పరికరాలను మాత్రమే వాడాలని కోరారు. అవసరం లేనప్పుడు స్విచ్ ఆఫ్ చేయాలని, ఎసిలను రిమోట్‌తో ఆఫ్‌చేసిన తర్వాత స్విచ్ కూడ ఆఫ్ చేయాలని పేర్కొంటూ నినాదాలు చేశారు. దీనివల్ల విద్యుత్తు బిల్లులు కూడ తగ్గుతాయని ఈ సందర్భంగా ఇఇ పేర్కొన్నారు.కార్యక్రమంలో డిఇఇలు ఎం.సురేంద్రనాధ్, మురళీధర్‌రెడ్డి, ఎఎఇ గంగయ్య, ఎఇలు చంద్రశేఖర్, ఉమాపతి, రామక్రిష్ణ, షఫి, ఈశ్వర్‌రాజు, విజయ్‌ఖుమార్‌రెడ్డి, చలపతి, యోగానంద, బాలక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామసచివాలయంను ప్రారంభించిన ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాలెం,డిసెంబరు17,ప్రభాతవార్త.



మండల పరిధిలోని చిన్నశెట్టిపల్లె గ్రామసచివాలయంను శనివారం స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గ్రామసర్పంచ్ ముక్కమల్ల లక్ష్మీదేవి,రాష్ట్ర వ్యసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయం,రైతుభరోసాకేంద్రంను సర్పంచ్ లక్ష్మీదేవి అద్యక్షతన స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ,రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డిలు ప్రారంభించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి రావటంతోపాటు,కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదని తెలిపారు.రైతు భరోసా కేంద్రంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపాల్‌రెడ్డి తెలుపుతూ వ్యవసాయ సలహాలు,సూచనలు అధికారులు ఇస్తూ గ్రామంలోనే అందుబాటులో ఉండటం రైతులకు ఎంతో ఉపయోగం అన్నారు.ఈకార్యమ్రంలో మండల ఇంచార్జ్ యంపిపి వెలవలి నారాయణరెడ్డి,వైసిపి నాయకులు సూర్యనారాయణరెడ్డి,శివశంకర్‌రెడ్డి,హరిచంద్రారెడ్డి,నరశింహ్మారెడ్డి,రాజారమ్మోహన్‌రెడ్డి,మధుసూధన్‌రెడ్డి,వెంకటరెడ్డి,శివనాగిరెడ్డి,యంపిడిఒ సయ్యద్‌హుస్నీసా,డిప్యూటి తాసిల్దార్ సాయి, ఏపిఒ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాపు రాక్స్ బలిజ సమావేశాన్ని జయప్రదం చేయండి

బద్వేలు, డిసెంబరు 17 ప్రభాతవార్త :

నేడు ఆదివారం కడప నగరంలోని బిల్టప్ సమీపాన శ్రీ దుర్గా దేవి టెంపుల్ సమీపంలో జరిగే కాపు రాక్స్ సమావేశానికి ఉమ్మడి జిల్లాల్లో ఉండే బలిజలంతా తరలివచ్చి జయప్రదం చేయాలని బలిజ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు (డివి), ప్రధాన కార్యదర్శి కొర్రపాటి సురేంద్ర, ఉపాధ్యక్షులు కొంకల వెంకట రమణ, గుర్రాల హరిక్రిష్ణ, తోట రాము, ఉప్పలపాటి రఘురాములు, గాజుల వంశీ, తుంగా సురేంద్ర మరియు బలిజ సంఘం సభ్యులు సుబ్రమణ్యం, సుమన్, కొంకుల సుదర్శన్ మరియు కాపు రాక్స్ బద్వేలు అడ్మిన్ టీం సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సమయం ఆసన్నమైందని, కాపు రాక్స్ అంతా ఒక వేదికపైకి రావడం శుభ పరిణామంగా భావిస్తూ ఉమ్మడి జిల్లాలో ఉండే బలిజలంతా ఈ సమావేశానికి హాజరై జరుగుతున్న, జరగబోతున్న పరిణామాలపై బలిజలంతా ఏకమై భవిష్యత్తుకు నాంది పలికేలా సమావేశంలో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాపు రాక్స్ గ్రూప్‌ను ప్రస్తుతానికి విద్య, ఉద్యోగ, ఉపాధి మరియు ఆరోగ్యం అనే ప్రధాన పునాదుల మీద మాత్రమే నడిపించడం జరిగిందని, ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో పరిస్థితులకు అనుగుణంగా ఎన్నో మార్పులు చేర్పులు జరిగే అవకాశాలున్నాయి కాబట్టి బలిజలంతా వారి అభివృద్ధితో పాటు సమస్యలను అధ్యయనం చేసుకొని ముందుకు వెళ్ళే దిశగా అడుగులు వేసేందుకు ఈ సమావేశం పునాది లాంటిదన్నారు. బలిజ, కాపు రాక్స్ వ్యవస్థాపకులు పెద్దిరెడ్డి శివ భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ సమావేశానికి బద్వేలు నియోజకవర్గ పరిధి నుండి ప్రతి ఒక్కరూ తరలివచ్చి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే నా లక్ష్యం

పోరుమామిళ్ళ రూరల్, డిసెంబర్ 17ప్రభాతవార్త:

పోరుమామిళ్ళ మేజర్ పంచాయతీలో గత మూడు రోజుల నుండి మెయిన్ పైప్‌లైన్ పగిలిపోవడంతో ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న మేజర్ ఫంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ గత రెండు రోజుల నుండి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీనప్ప బావి వీధి దగ్గర నుండి ఉన్న పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి ప్రజలకు నీటి అసౌకర్యం కలకుండా సమస్యను పరిష్కరించి ప్రజలకు నీటి సరఫరా అంతరాయం కలగకుండా చూశారు. దీంతో ఆయన్ను పలువురు అభినందించారు.

## ఘనంగా శ్రీ ఈశ్వరిదేవి ఆరాధనోత్సవాలు

చిట్వేలి, డిసెంబరు 17 ప్రభాతవార్త



మండలంలోని స్థానిక కంపసముద్ర అగ్రహారం కుమ్మరపల్లి గ్రామాల్లో వెలసి ఉన్న శ్రీ ఈశ్వరిదేవి ఆరాధనోత్సవాలు 16వ తేది శుక్రవారం నుండి 17వ తేది శనివారం వరకు ఘనంగా నిర్వహించారు. మార్గశిర బహుళ నవమి శ్రీ ఈశ్వరిదేవి జీవ సాధి నిష్ఠ వహించిన పవిత్ర శుభదినం ఈ సందర్భంగా 40 రోజులు దీక్ష వహించి ఇరుముడితో కొన్ని వందల కిలోమీటర్లు కాలినడకన చిట్వేలి చేరుకుని అక్కడి నుంచి అగ్రహారం వరకు ఊరేగింపుగా దేవస్థానం చేరుకొని అమ్మవారికి ఇరుముడి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి కాయ కరూ ్వరం, ఇరుముడిని సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు, ప్రజలకు భారీఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని అగ్రహారం చిట్వేలి వరకు మేళతాళాలతో మంగళ వాయిద్యాల మధ్య బాణాసంచ పేల్చుతూ ఊరేగింపు నిర్వహించారు.

## పాకిస్తాన్ విదేశాంగ మంత్రి దిష్టిబొమ్మ దగ్ధం

కడప కార్పొరేషన్, డిసెంబరు 17, ప్రభాతవార్త:



ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిల్వాల్ భుట్టో నరేంద్ర మోదీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి అన్నారు. శనివారం కడప నగరంలో ఆర్టీసీ బస్టాండు దగ్గర అంబేద్కర్ కూడలిలో నిరసన ప్రదర్శించారు. పాకిస్తాన్ విదేశాంగ శాఖామంత్రి భుట్టో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇలాంటి వ్యాఖ్యల పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అనంత కేశవరావు, ఓబీసీ ఈసీ మెంబర్ పద్మావతి బాయ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు శోభా బాయి, సీనియర్ నాయకులు హరి నారాయణ, లక్ష్మణరావు, సతీష్, డా.మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మినీలారీ - స్కూటర్ ఢీ : ఒకరు మృతి

పెనగలూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త



మినీలారీ – స్కూటర్ ఢీకొని వెంకటసుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని బెస్తపల్లె సమీపంలో ఎపి39డబ్ల్యు 4551 నంబరు గల మినీలారీ ఎపి39బిఎల్ 3453 నంబరు గల స్కూటర్‌ను ఢీకొనడంతో వెంకటసుబ్బయ్య అకకక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కోమంతాజపురంకు వచ్చి తిరుగు ప్రయాణంలో మినీలారీ ఢీకొనడంతో మృతిచెందాడు. నందలూరు మండలంలోని నూకినేనిపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్య పెంచలయ్య ఇద్దరు బైకులో సొంత గ్రామానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బయ్య మృతిచెందగా, గాయపడిన పెంచలయ్యను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## ఎస్ఆర్ఐటీలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 17, ప్రభాతవార్త:




సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎస్ఆర్ఐటీ కళాశాలలో డిప్లొమో, బీటెక్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ తమ సీనియర్స్‌తో సోదర భావంతో స్నేహపూర్వకంగా కలిసి మెలసి ఒక మంచి వాతావరణం నెలకొల్పుకొని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలలో స్థిరపడి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు సాధించి పెట్టాలన్నారు. ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో గల ల్యాబ్‌లు, లైబ్రరీ సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించిన నృత్యాలు అలరించాయి. వైస్‌ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, డీన్‌లు, హెచ్‌ఒడీలు, అధ్యా పకులు ఏవో జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

బద్వేలు రూరల్, డిసెంబరు 17 ప్రభాతవార్త :



మండల పరిధిలోని గొడుగునూరు ప్రాంతంలోని చెరువు దక్షిణ భాగాన హరిజనవాడ ఎస్సీ కాలనీకి చెందిన ప్రధాన రహదారి పై భూ కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడి ఇష్టానుసారంగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ అడ్డు వచ్చిన వారికి హెచ్చరికలు జారీ చేస్తూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తుంటే గ్రామస్తులైన ఒకరు తహసీల్దారుకు మరియు రెవిన్యూ డివిజన్ అధికారికి స్పందన కార్యక్రమంలో అర్జీ ఇవ్వగా స్పందించిన అధికారులు వెనువెంటనే గొడుగునూరు గ్రామానికి చేరుకొని అక్కడ ఉన్న ఆక్రమణదారులు ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రే ఆక్రమించి చెట్లు నాటడం ఏమిటని ఆక్రమణదారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయానికి పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అక్కడికి చేరుకొని విషయం తెలుసుకొని భూమి మీ ఇష్టం, రహదారి మాత్రం వదలకుండా ఆక్రమించడం ఎంత వరకు సమంజసం అని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఆక్రమణదారులు మాత్రం రహదారి కూడా వదలకుండా ఆక్రమించడం శోచనీయంగా మారింది. ఇందుకుగాను గ్రామస్తుడైన ఒకరు ఆర్డీవోకు విన్నవించగా త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని తెలియజేసినట్లు సమాచారం. ఈ విషయమై సదరు ఉన్నతాధికారులు, అధికారులు స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు. చెట్లు నాటుకోవడం వారి ఇష్టానికే వదిలేశామని, కాకపోతే అక్కడ రహదారి పది మందికి ఉపయోగపడేదని, అటువంటి రహదారిని ఏ విధంగా కబ్జా చేస్తారంటూ కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రెవిన్యూ సిబ్బందికి స్పందన కార్యక్రమంలో 8వ తేదీన విన్నవించినా ఇంత వరకూ స్పందించకపోవడం శోచనీయం అని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సదరు ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

### భూ ఆక్రమణలు ఉపేక్షించేది లేదు–తహసీల్దారు :

మండల పరిధిలోని గొడుగునూరు గ్రామంలో ఏర్పడిన సమస్యను ఆర్ఐ ద్వారా విషయం తెలుసుకున్న తహసీల్దారు మల్లిఖార్జున రెడ్డి సమస్యపై అధికారులకు విన్నవించినట్లు, భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ భూమి ఎవరి సొత్తు కాదని, అది గ్రామానికి చెందిన ప్రజా అవసరాలకే ఉపయోగించాలని, ప్రజల రాకపోకలు దారి కల్పించకపోతే కఠిన చర్యలు తప్పవని భూ ఆక్రమణదారులపై ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందుకు ఉన్నతాధికారులు, అధికారులు ఎవరి జోక్యం ఉండదని, ఇటువంటి వారిని తప్పనిసరిగా చట్ట పరమైన చర్యలు చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని, తమ దృష్టికి వచ్చిన కొన్ని సమాచారాల మేరకు వారిని హెచ్చరించడం జరిగిందన్నారు. దానికి వారు సానుకూలంగా సమాధానం ఇచ్చారని, అయితే రహదారి ఉన్నట్లు వివరించారు. ఇందుకై స్పందన కార్యక్రమంలో అర్జీని అందించిన వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపినట్లు పేర్కొన్నారు. ఆర్ఐ సహకారంతో అక్కడ ఉన్న సమస్యను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు.